క్లుప్తంగా

నేడు నీటి సరఫరాకు అంతరాయం

గాజువాక: గాజువాకజోన్ పరిధిలోని వివిధ వార్డుల్లో శనివారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ గాజువాక వాటర్ సప్లై సహాయ ఇంజినీర్ పి.కేదార్‌నాథ్ తెలిపారు. సుందరయ్య కాలనీలోని 10 ఎంజీడీ మంచినీటి శుద్ధి కర్మాగారంలో ఈపీడీసీఎల్ సిబ్బంది రెండు రోజులుగా విద్యుత్ లైన్ల నిర్వహణ, చిన్న చిన్న మరమ్మతులు కొనసాగిస్తున్నారు. ఈ కారణంగా నీటి పంపింగ్ నిలిచి పోయినట్టు ఏఈ తెలిపారు. దీంతో 70 నుంచి 74వ వార్డు వరకు, 76, 64, 65 వార్డులకు శనివారం నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గవర్నర్ కంభంపాటికి సత్కారం



గవర్నర్ హరిబాబును సత్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును శుక్రవారం బీజేపీ సీనియర్ నాయకుడు కరణంరెడ్డి నర్సింగరావు మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ విచ్చేసిన గవర్నర్‌ను సహచర నాయకుడు బొత్స దిలీప్ కుమార్‌తో నగరంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

ప్రైవేటు క్యాంటీన్ల తొలగింపు ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటు క్యాంటీన్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది.ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వుల మేరకు షాపులను తక్షణం మూసి వేసి ప్లాంట్ ప్రాంగణం వదలి వెళ్లాలని ఆయా షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటు క్యాంటీన్లు, పాన్‌షాపులు, జ్యూస్ షాపులు సుమారు 70 ఉన్నట్టు యాజమాన్యం గుర్తించింది. అదే విధంగా గతంలో క్యాంటిన్ నిర్వహించి ప్రస్తుతం మూతపడినవి సుమారు 20 ఉన్నాయి. మొదటి దశలో మూతపడిన క్యాంటీన్ల షెడ్ల తొలగింపు పనులు గురువారం సాయంత్రం ప్రారంభించారు.ఇవి పూర్తయిన తర్వాత ప్రస్తుతం నడుస్తున్న క్యాంటీన్లపై యాజమాన్యం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

మసకబారిన దువ్వాడ నేమ్ బోర్డు



డిజిటల్ అక్షరాలు వెలగని దువ్వాడ రైల్వేస్టేషన్ బోర్డు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగోప్లాట్‌ఫారం వైపు డిజిటల్ బోర్డులో అక్షరాలు మసకబారాయి. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రధాన ద్వారం ఎలివేషన్‌లో నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే రాత్రి వేళల్లో కనపడడం కోసం డిజిటల్ బోర్డ్ ఏర్పాటు చేశారు. అయితే వాటిలో సగం బోర్డులో దీపాలు వెలగకపోవడంతో అక్షరాలు సగం సగం వెలుగుతుండడంతో నేమ్ బోర్డు మసకబారింది.

వివాహితకు ఆశ్రయం



వివాహితను షెల్టర్ నిర్వాహకుడు ప్రగడ వాసుకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ గాయత్రి

అల్లిపురం: కాకినాడకు చెందిన వివాహిత వానపల్లి జ్యోతిశ్రీ (27) భర్త హింస భరించలేక ఇల్లు వదిలి విశాఖ చేరుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భర్త రోజూ కొడుతుండడంతో ఇల్లు వదిలి పుట్టింటికి వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి అత్తవారి ఇంటికి పంపించారు. అయితే అత్తగారే చాడీలు చెబుతూ, కొడుకుతో కలిసి చిత్ర హింసలు పెడుతుండటంతో ఆమె తట్టుకోలేక ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. ఒంటరిగా మహారాణి పేట రోడ్ల మీద తిరుగుతూ ఉండగా లేడీ కానిస్టేబుల్ గాయత్రి ఆమెను చూసి వివరాలు తెలుసుకుంది. ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్‌కు తీసుకెళ్లింది. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో జీవీఎంసీ మహిళల వసతి గృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మీయం.. అనుబంధం



శంకరనారాయణ కుటుంబంలో రాఖీ సంబరాలు



మార్కెట్‌లో అందుబాటులో పలురకాల రాఖీలు



సోదరుల ఇళ్లకు చేరిన అక్కాచెల్లెళ్లు

రక్షాబంధన్ వేడుకలకు అంతా సిద్ధం

పెదగంట్యాడ: అన్నాచెల్లెళ్లు..అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ. తోబుట్టువులు సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలంటూ ఎక్కడ ఉన్నా సోదరులఇంటికి వచ్చిరాఖీలు కడుతుంటారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు రాఖీ పండగ జరుపుకుంటారు.కష్టసుఖాల్లో మేమున్నామనే భరోసాను అక్కా చెల్లెళ్లకు కల్పించమే రాఖీ బంధం.

నేడు రక్షా బంధన్ సందర్భంగా సాక్షి కథనం...

రాఖీ పండగను చిన్నారులు మొదలుకుని వృద్ధుల వరకూ అందరూ వేడుకగా చేసుకునే పండగే రాఖీ పండగ. తమను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే అన్నయ్య, తమ్ముళ్లు ప్రతి చెల్లి, అక్కకు అభిమానమే. సోదరీసోదరుల ఆత్మీయతకు అద్దం పట్టేదే రక్షా బంధనం.. ఇంటి ఆడుపడుచు మహాలక్ష్మి స్వరూపంగా భావించే సంస్కృతి మనది. కష్టాసుఖాల్లో మేము మీకు అండగా ఉన్నామన్నా భరోసాను సోదరులు అక్కా చెల్లెళ్లకు కల్పించడం.. వారి మధ్య అనుబంధానికి ప్రతీకంగా నిలిచే రాఖీ పౌర్ణమిని శనివారం అట్టహాసంగా జరుపుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అక్కాచెల్లెళ్లు సోదరుల ఇళ్లకు చేరుకున్నారు.రావడానికి వీలు కుదరని వారు పోస్టు ఇతర మార్గాల ద్వారా రాఖీలు పంపిస్తారు.



పెదగంట్యాడలో రాఖీలు కొనుగోలు

హైదరాబాద్ నుంచి వచ్చా..



మాది పెదగంట్యాడ దరి సమతానగర్. వివాహం తర్వాత హైదారబాద్‌లో నివాసం ఉంటున్నాం. ఎన్ని పనులు ఉన్నా ఏటా నా చేతితో రాఖీ తయారు చేసి ఒకరోజు ముందుగానే సమతానగర్ వచ్చేస్తా. అన్నయ్య సూర్యకు రాఖీ కట్టడం నాకు ఎంతో ఇష్టం. రాఖీ కట్టి అతను ఇచ్చే కానుకలను భద్రంగా దాచుకుంటాను.

– జయమాధురి, హైదరాబాద్

ఏటా వచ్చి రాఖీ కడతా..



అన్నయ్యలు శ్రీను, తమ్ముడు సతీష్‌కి రాఖీ కట్టడం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. నేను పెళ్లి చేసుకుని విజయనగరంలో ఉంటున్నాను. ప్రతి ఏటా గాజువాక వచ్చి అన్నయ్య, తమ్ముడికి రాఖీ కట్టి సందడిగా గడుపుతాము. చాలా ఆనందంతో తిరిగి ఇంటికి వెళ్తాను.

–పెంటపాటి కుమారి, విజయనగరం

తోబుట్టువులకు ఆనందం



రక్షా బంధన్ రోజు తప్పని సరిగా సోదరుడికి రాఖీ కట్టి తోబుట్టువులు ఆనందం పొందుతారు. సెల్‌ఫోన్ల వినియోగం విపరీతంగా పెరగడంతో ప్రేమానురాగాలు, కుటుంబ బంధాలు, మానవతా విలువలు తగ్గుముఖం పట్టాయి. ఈ తరుణంలో ఇలాంటి పండగలు కలిసి చేసుకోవడం మీకు మేమున్నాం అనే భరోసా కలుగుతుంది.

– కేసారపు మీనాక్షి, వినాయకనగర్..

విడదీయని బంధం



రాఖీ పండగ సోదర భావాన్ని గుర్తు చేస్తుంది. అన్నా చెల్లెళ్ల బంధం జీవితంలో విడదీయరానిది.హైదరాబాద్‌లో ఉంటున్న మా సోదరులకు రాఖీ కడుతుంటాను. ఆ అనుబంధం మాటల్లో చెప్పలేనిది.

– కులుకూరి సువర్ణ, కొత్తకర్ణవానిపాలెం

అన్నయ్య అంటే ధైర్యం



అమ్మలోని మొదటి అక్షరం.. నాన్నలోని రెండో అక్షరం కలిపితే ఏర్పడేది అన్నయ్య. మా అన్నయ్యకి రాఖీ కడితే నాకు చాలా ధైర్యాన్నిస్తుంది. మా ఇంట్లో ఇదే పెద్దపండగ. రాఖీ పండగ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను..

– ఆకుల రామలక్ష్మి, సీతానగరం

ముఖ్యమైన పండగ



మహిళలకు ఎంతో ముఖ్యమైన పండగ రాఖీ పౌర్ణమి. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు కుటుంబ బంధాలు బలపడడానికి రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుంది. ప్రేమ, ఆత్మీయత,అనుబంధానికి ఈ పండగ కేరాఫ్.

– మంత్రి జయంతి, నడుపూరు

ప్రేమానురాగాలు



అన్నాతమ్ముళ్ల రక్షణ, శ్రేయస్సు కోరి అక్కా చెల్లెళ్లు కట్టే రాఖీ పండగను ఎంతో సంతోషంగా జరుపుకుంటాం. మాది భీమవరం. అన్నయ్య పెదగంట్యాడలో ఉంటాడు. ప్రతి పండగకు ఒకరోజు ముందుగానే గాజువాక వచ్చి అన్నయ్యకు రాఖీ కడతాను.

– కొత్త శ్రీలక్ష్మి , భీమవరం

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల బాలికల అండర్–19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ ఖర్గ్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.

ఈఎల్ పునరుద్ధరించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అర్జిత సెలవులు (ఈఎల్) ఎన్‌క్యాష్‌మెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎండీకి వినతి పత్రం అందజేశారు. ఈఎల్ పై ఆధారపడి పిల్లల ఫీజులు చెల్లించుకునే వారని పేర్కొన్నారు. ఉద్యోగుల పరిస్థితి అర్థం చేసుకుని లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పునరుద్ధరించాలన్నారు. అధికారులకు 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం ఉండగా కార్మికులకు 200 లీవులు మాత్రమే పొదుపు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్మికులు లీవులు కోల్పోకుండా అధికారుల వలే 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం కల్పించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్, అధ్యక్షులు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు.

ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు ముఖం చాటు!

- స్టాండ్‌లోకి రాని ఆటోలు
- రోడ్డుపైనే వెయిటింగ్
- అధిక భారంతో ప్రయాణికుల విలవిల



ఖాళీగా దర్శనమిస్తున్న ప్రీపెయిడ్ ఆటోస్టాండ్



ఆటోలు లేకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న పోలీస్ కంట్రోల్ పాయింట్

అగనంపూడి: ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు ముగింపు పలికేందుకు ఆటో డ్రైవర్లు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పది రోజుల కిందటే ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రయాణికుల భద్రతతో పాటు ధరలు అందుబాటులో ఉంచేందుకు ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. అప్పట్లో 70 ఆటోల వారు ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌లో నమోదు చేసుకున్నారు. పోలీసులు కిలోమీటర్లను అనుసరించి ధరలు నిర్ణయించారు. ఆ మేరకు ఆటోలు నడిపితే డ్రైవర్లు ఆశించిన డబ్బులు రావని భావించిన ఆటోవాలాలు స్టాండ్‌లో కాకుండా ఆరుబైట ఆటోలు నిలిపేస్తున్నారు. అధికారిక ఆటో స్టాండ్‌లో ఆటోలు నిలపడం మానేశారు. నేరుగా స్టేషన్ ఆవరణకు వెళ్లిపోయి ప్రయాణికులతో మాట్లాడుకొని వారు నిర్ణయించిన రేటు ప్రకారం ప్రయాణికులను తీసుకువెళ్తున్నారు. దీంతో ప్రయాణికులకు మేలు చేయాలని భావించి తాము చేసిన పోరాటం మూణ్నాళ్ల ముచ్చటగా మారే పరిస్థితి ఉందని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్దకు వెళ్లి ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్ ఉందని, అక్కడికి వెళ్తే తక్కువ ధరకు భద్రంగా గమ్యస్థానాలకు వెళ్లవచ్చని యూనియన్ నాయకులు చెబుతున్నారు.దీంతో ప్రయాణికులు తీరా అక్కడికి వెళ్లాక ఆటోలు అందుబాటులో లేకపోవడంతో పోలీస్ కంట్రోల్ సిబ్బంది కూడా చేసేది లేక చేతులు ఎత్తేస్తున్నారు.

ధరలు ఇలా

పోలీసులు నిర్ణయించిన ధర ప్రకారం ఉక్కు నగరానికి రూ.90 చెల్లించాలి. కానీ ఆటో డ్రైవర్లు ఇప్పటి వరకు రూ.200 నుంచి రూ.250 వరకు వసూలు చేస్తున్నారు. అదే రాత్రి తొమ్మిది దాటితే డ్రైవర్లు అడిగినంత చెల్లించుకోవాల్సిందే. ఆ రేట్లకు అలవాటు పడిన డ్రైవర్లు ససేమేరా అంటుండడంతో ప్రయాణికులకు భారం తప్పడం లేదు.

రైల్వేస్టేషన్ ముఖద్వారం మార్చాలి

స్టేషన్ బయటకు వెళ్లి బస్టాప్ వద్దకు వెళ్తే తప్పా ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ కనపడడం లేదు. స్థానికంగా ఉన్న ప్రయాణికులకు తప్పా ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్ విషయం తెలియని పరిస్థితి. ఈ క్రమంలో స్టాండ్‌ను ఔట్ గేటుకు ఆనుకొని పెడితే తప్పా ప్రయాణికులకు న్యాయం జరిగే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఆటోలను ఔట్ గేటు బయటే నిలిపేలా చేయాలని ప్రయాణికులు, రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రైల్వే, పోలీస్ కమిషనర్లను కోరుతున్నారు. ఆటో స్టాండ్ ఉన్నట్టు ప్లాట్ ఫారాల, ఇన్‌గేటు, బుకింగ్ కౌంటర్ వద్ద బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛ రైల్వేస్టేషన్ రేపు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వచ్ఛ రైల్వేస్టేషన్ కార్యక్రమం చేపట్టనున్నామని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. మానవ వికాస వేదిక, మానవతా కూర్మన్నపాలెం, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్, స్పందన చేయూత ఫౌండేషన్, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ , లయన్స్‌క్లబ్, సాయి సేవా సమితి కూర్మన్నపాలెం, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అగనంపూడి సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో యువజన సంఘాలు, మహిళా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వాములు కావాలని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.జాషువా, కంచుమూర్తి ఈశ్వర్ కోరారు.

పూటుగా మద్యం తాగి వ్యక్తి మృతి

ఎంవీపీకాలనీ: అధికంగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మద్దిలపాలెంలో జరిగింది. ఎంవీపీ పీఎస్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోపాలకృష్ణ(55) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి మద్దిలపాలెంలో నివసిస్తున్నాడు. తన దగ్గరి బంధువుల ఇంట్లో ఫంక్షన్ కావడంతో శుక్రవారం ఉదయం నుంచి పూటుగా మద్యం తాగాడు. మధ్యాహ్నం అదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై మరణించి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిగా భావించి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కేజీహెచ్‌కు వెళ్లి పోలీసులను సంప్రదించగా.. మృతదేహాన్ని వారికి అప్పగించారు.

రైలు ప్రమాదంలో గాయపడిన విష్ణుయాదవ్ డిశ్చార్జి



రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ రాధాకృష్ణన్

మహారాణిపేట: కదులుతున్న రైలు నుంచి ప్రమాదశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డ విష్ణుయాదవ్ (26)ను వైద్య సేవలు అందించి శుక్రవారం కేజీహెచ్ వైద్యులు డిశ్చార్జి చేశారు. గత నెల 27న కరకవలస వద్ద కదులుతున్న రైలు నుంచి విష్ణుయాదవ్ జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో అతని ఎడమ చేయి భుజం వరకు తెగి శరీరం నుంచి వేరు పడింది. స్పృహ లేని స్థితిలో ఉన్న యాదవ్‌ను కేజీహెచ్ అత్యవసర విభాగంలో చేర్పించారు. రక్తం ఎక్కించి శస్త్ర చికిత్స నిర్వహించారు. మత్తు, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలు సంయుక్తంగా శస్త్ర చికిత్స చేసి రోగి త్వరగా కోలుకునే విధంగా వైద్య సేవలు అందించారు. శుక్రవారం డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణన్ రోగిని పరామర్శించి డిశ్చార్జి చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. రోగి, వారి బంధువులు వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..



హోమంలో పాల్గొన్న భక్తులు



ధనలక్ష్మి దేవిగా కనకదుర్గమ్మ



పూలతో అలంకరించిన లలితా త్రిపురసుందరీదేవి

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీపూజ

కూర్మన్నపాలెం: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా సౌభాగ్యం, సిరిసంపదలను ప్రసాదించే వరలక్ష్మీ వ్రతాన్ని గాజువాక నియోజకవర్గంలో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. వడ్లపూడి ప్రాంతంలో సందడి నెలకొంది. వివిధ కాలనీల్లో ఉన్న దేవాలయాలు భక్తులతో నిండిపోయాయి. మహిళలు సైతం వాయనాల పేరుతో గుంపులు,గుంపులుగా కాలనీల్లో కలియతిరుగుతూ కన్పించారు. కొన్ని ప్రాంతాల్లో తమ ఇళ్ల ముందు టెంట్లు వేసి ప్రజలకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

- జీవీఎంసీ 88వ వార్డు గ్రీన్‌సిటీలోని దేవాలయంలో కలువపూలతో పూజలు చేశారు.
- 86వ వార్డు రాజీవ్‌నగర్ కాశీ విశ్వేశ్వరాలయంలో సైతం అత్యంత వైభవంగా దీపారాధన చేశారు. లక్ష్మీపురం కాలనీలోని త్రిశక్తి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అమ్మవార్లకు మహిళలు ప్రత్యేక అలంకరణ చేసి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.
- 87వ వార్డు కణితి రజకవీధిలో లలితా త్రిపుర సుందరిదేవిని చక్కగా అలంకరించి వరలక్ష్మి వ్రతం ఆచరించారు.

ధనలక్ష్మిగా కనకదుర్గమ్మ

పెదగంట్యాడ: బర్మా కాలనీ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. నోట్లతో ప్రత్యేకంగా అలంకిరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

- హౌసింగ్‌బోర్డు కన్యకాపరమేశ్వరీ పంచాయతన దేవాలయంలో సూక్త సంపుటిత అష్టోతరం, తామర, కలువ పుష్పాలతో పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మొగలపల్లి త్రిమూర్తులు, బొండాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోని వాసవీ జ్ఞానమందిరంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

అగనంపూడి ప్రాంతంలో..

అగనంపూడి: వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం అగనంపూడి, దువ్వాడ, లంకెలపాలెం ప్రాంతాల్లో మహిళలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి పూజలకు ఉపక్రమించారు. పూజ అనంతరం ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి చీర, జాకెట్, పండ్లు, ఫలహారాలు అందించారు.



అగనంపూడిలో పూజలందుకున్న అమ్మవారు

ఉక్కు త్రిశక్తి ఆలయంలో..

ఉక్కునగరం: మహాలక్ష్మి, మహాదుర్గ, మహాసరస్వతిలు వెలసిన త్రిశక్తి ఆలయంలో శుక్రవారం శ్రావణమాస పూజలు వైభవంగా జరిగాయి. మహాదుర్గకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఆలయ ప్రధానర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో సామూహిక లక్ష్మీపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రుత్వికుల ఆధ్వర్యంలో చండీహోమం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



త్రిశక్తి ఆలయంలో పూజలందుకున్న మహాలక్ష్మి, త్రిశక్తి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



నడుపూరులో సామూహిక పూజలు

ఉత్సాహంగా ఏయూ ఉద్యోగుల క్రికెట్ పోటీలు

మద్దిలపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగు లకు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు నాలుగు జట్ల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. సీఏ వో–1 జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆ టీం ప్లేయర్ గోవింద అత్యధికంగా 44 పరుగులు సాధించారు. శనివారం జరిగే పోటీల్లో 6 జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు వెంకటాద్రి, సిద్ధయ్య హాజరు కానున్నారు. పోటీల నిర్వాహకులుగా దువ్వి గోవింద, డి.శ్రీనివాసరావు, కోనా పోలారావు, కర్రి శ్రీనివాస్ వ్యవహరించారు. ఖాదర్‌బాబా, ఈశ్వరరావులు ఆసక్తికరమైన వ్యాఖ్యానంతో మ్యాచ్‌లను రక్తికట్టించారు.

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.